'అబ్బాయి బుద్ధిమంతుడు. బాదరబందీలేని మేస్టుద్యోగం. వాళ్ళకి కట్నకానుకల మీద పెద్ద పట్టుదల లేదు. మీరెంత ఇస్తే అంతే. అన్నింటినీ మించి అబ్బాయికి ఏ వ్యసనం లేదు'. పెళ్ళి కొడుకు గొప్పతనం పెళ్ళిళ్ళ పేరయ్య నాన్న గారికి వివరించి చెబుతూంటే గది పక్కన నిలబడి వింటున్న సుబ్బలక్ష్మికి ఎంతో ఆనందంగా వుంది. ముఖ్యంగా రేపే వాళ్ళు తనని చూడడానికి వస్తున్నారన్న విషయం ఆమెనెంతో పులకింపచేసింది. 'దేవుడు దయ తలచి తనకీ సంబంధం కుదిరితే బాగుండును' అని దేవుళ్ళకి మొక్కుకుంది. ఆ దేవతలు కరుణించారు. సుబ్బలక్ష్మి అందరికీ నచ్చడం, వెంటనే పెళ్ళి జరిగిపోవడం అయింది. భర్త చనువు వల్ల తొందరగానే బెరుకు తగ్గింది. సరదాగా తనతోటే వుండే భర్త దొరకడంతో ఆనందించింది.

గృహ ప్రవేశం టైంలో బంధువులంతా పేకాడుతూ 'రావోయ్ పెళ్ళి కొడకా రెండాటలు వేద్దాం' అన్నా తమ ఇంటికి యానాళ్ళకొచ్చినప్పుడు

'రండి సార్ రెండాటలాడుదాం' అని పిలిచినా వెళ్ళక పోవడం సుబ్బలక్ష్మికి ఆనందం కలిగించింది. కాపురానికొచ్చిన కొత్తలోనే ఒక రోజు ఆమె వంటకుపక్రమిస్తూంటే.

'సుబ్బూ! ఏవీ ఆ వంటకాలిలాతే, తరిగేస్తాను' అని కత్తిపీట, గిన్నెలు దగ్గర పెట్టుకుని తరగడానికి ఉద్యుక్తుడయ్యాడు. అది చూసిన సుబ్బలక్ష్మి

'నేను తరుక్కుంటాను లెండి. మీ కెందుకు శ్రమ. పేపర్ చదువుకోండి' అంది సుస్మితంగా తిరస్కరిస్తూ. అది విన్న కైలాసం



# సాగదీత

'వెధవ పేపర్లో ఏముంటుందే. అక్కడలాగ, ఇక్కడిలాగ అని పోచికోలు భాగోతం. ఆమాత్రం దానికి డెబ్బై అయిదు రూపాయలు ఆముదం' అంటూ దండకం మొదలెట్టాడు. భర్త పొదుపరి తనానికి సంతోషించింది. కైలాసం మాత్రం వంకాయలతో బాటు అల్లం, పచ్చిమిర్చి అన్నీ తరిగి వేర్వేరుగా సర్దేసి అమర్చాడు భార్యకి. అతడికి వంట చేసి భోజనం పెట్టి అతడు బడికెళ్ళాక ఎంతగానో ఉన్నతంగా ఊహించుకుంది భర్తని. తను వచ్చిన దగ్గర్నుంచీ చూస్తున్న ఆమెకి భర్త అన్నింట్లోనూ సాయం చెయ్యడంతో అలాటి భర్త దొరికినందుకు ఆనందించింది.

* * *

భర్త ఆ సమయంలో ఇంటికి రావడం చూసి ఆశ్చర్యపోయింది. విషయమడిగితే 'సింగిల్ సెషన్' అని చెప్పాడు. ఆ మాటతో సుబ్బలక్ష్మి ఉత్సాహం అంతా నీరుగారిపోయింది. ఎన్నాళ్ళుగానో పక్కింటి పార్వతమ్మ గారింటి కెళదామంటే ఆ పని ఆమె ఇవాళ ఆ ప్రోగ్రాం వేసుకుంది. అసలు పెళ్ళయిన ఈ మూడు నెలల్లోనూ, పరిచయంకాక కొన్నాళ్ళు, చనువు లేక కొన్నాళ్ళు ఎక్కడికీ వెళ్ళ లేక పోయింది సహజంగా మొహమాటస్తు రాలైన సుబ్బలక్ష్మి. ఇవాళ అనుకునే సరికి భర్త రావడంతో నీరు కారిపోయింది ఆమె ఉత్సాహం. ఆ స్థానంలో భయం చోటు చేసుకుంది. భర్త ఇంటి పట్టునే వుండడం ఆమెకు ఇప్పుడిప్పుడే చిరాకు కలిగిస్తోంది. ఆమె ఆలోచనలు పూర్తి కాకుండానే అనుకున్నంతా అయింది. ఇంట్లో డబ్బాలన్నీ తీసి ప్రతి దానిమీద చీటీలు రాసి అంటించే కార్యక్రమం చేబట్టి వాటినెలా సర్దాలి' అన్న దగ్గర్నుంచి టూత్ పేస్టు ట్యూబు ఎలా నొక్కాలి లాంటి చిట్కాలు చెబుతూ సాయంత్రం వరకూ ఊదరగొట్టేశాడు.

ఎంతైనా తనూ చదువుకున్నదే. కామన్ సెన్స్ తెలుసు. ఇలా ప్రతి చిన్న విషయాన్ని చాదస్తంగా చెబుతూండడం చిరాకేసింది. కానీ బయట పడకుండా అణచుకుంటోంది. ఎంత అణచు కుందామన్నా బయటపడక తప్పని స్థితి అంతకు మరి రెండు రోజుల్లోనే జరిగింది. ఆరోజు ఆది వారం. ఇంటికున్న పట్లు అన్నీ దులిపి కూర్చున్నాడు కైలాసం. అంతటితో ఆగకుండా అటక మీదవున్న బిందెలు, అండాలులాటి ఇత్తడి సామాన్లన్నింటినీ దించి చింతపండు ఎక్కించి తోమడం మొద లెట్టాడు. వారించినా వదల్లేదు. అలాటప్పుడే వీధి తలుపు తీసుకుని నలుగు రాడవాళ్ళు వచ్చారు. చేతిలో కుంకుమ భరిణ వుంది.

'సాయంత్రం బాబుని వుయ్యాల్లో వేస్తున్నాం చూడడానికి రండి' అని పిలిచి వెళ్ళిపోబోయారు. 'ఆదివారం కూడా అన్నయ్య గారికి రెస్టు ఇవ్వ రేంటి' అంది ఒకామె. అది విన్న సుబ్బలక్ష్మి జవాబు చెప్పే లోగానే కైలాసం అందుకుని

'ఆదివారం కదండీ. ఖాళీగా కూర్చోడమెందుకని ఈ పని పెట్టాను' అన్నాడు. అంతటితో ఆగితే బాగుండేది. కానీ అందులో మరొకావిడతో.

'మీ ఆడబడుచుని పురిటికి తీసుకు వచ్చారు కదా? పురుడొచ్చిందా?' అనడిగాడు. మండిపో తోంది సుబ్బలక్ష్మికి. ఆ ప్రశ్నకి ఆవిడ 'లేదండీ' అంది ముక్తసరిగా.

దాంతో ఆగకుండా 'నీళ్ళు పోసుకున్న రోజులు (గర్భం ధరించే రోజులు) సరిగా లెక్కకట్టారా?'



-అయ్యగారి శ్రీనివాసరావు

అంటూ ఆ రకమైన రోజుల్ని ఎలా లెక్కక ట్టాలి, మొదలుకుని గర్భధారణకి సంబంధించిన విషయాలన్నీ అంతగా పరిచయం కూడా లేని ఆ ఆడవాళ్ళ దగ్గర చెప్పడం మొదలెట్టాడు. ఆ మాటలకి వాళ్ళంతా సగంలోనే

'వస్తామండీ' అంటూ సుబ్బలక్ష్మితో చెప్పి, ఆమె వైపదోలాగ చూసి ఏదో గొణుక్కుంటూ వెళ్ళిపోయారు. వాళ్ళటు వెళ్ళగానే మనసులోని కోపాన్నంతా వెళ్ళగక్కుతూ

'మీకంతగా ఊసుకపోకపోతే పది మంది పిల్లలకి ప్రైవేటు చెప్పకోకూడదూ' అంది ఆ మాటకి కైలాసం.

'ఎవడొస్తాడే ఈ తెలుగు మేస్టరు దగ్గర ప్రైవేటుకి. ఊసుకపోటం లేదు. కాలక్షేపం కోసరి ఉత్తినే చెబుతానన్నా ఒక్కడూ రాడు. అయినా స్కూల్లో అరిచింది చాలక ఆ మేకల మందనంతట్నీ ఇంటి మీదికి తోలుకు రమ్మంటావేమిటి' అంటూ చిర్రున లేచాడు. సగటు ఇల్లాలైన సుబ్బలక్ష్మి బయట కేమనలేక మనసులోనే బాధపడింది. అప్పడనుకుంది.

'వ్యసనం లేని మగాడని సంతోషిస్తారు గాని. నిజానికి ఏ వ్యసనం లేని మగాడు భర్తగా దొరకడం ఎంత నరకంగా వుంటుందో ప్రత్యక్షంగా తెలుసుకుంది. అయితే ఈ చిన్న సంఘటనలతో ఆమె భర్తకి ఏదైనా వ్యసనం కలిగితే బాగుణ్ణనే ఆలోచన రాలేదు. కానీ మరి కొద్ది రోజుల తరువాత జరిగిన అనుభవం ఆమెకా ఆలోచన కలిగించింది. ఆ విధం బెట్టిదనిన...

* * *

మొదటి సారిగా భర్తతో కలిసి బంధువుల ఇంట పెళ్ళికి వెళ్ళింది సుబ్బలక్ష్మి. అందుకానందంగా వుంది. బంధువులంతా కొత్తయినప్పటికీ కొద్ది మంది తెలిసిన వారి ద్వారా మిగిలిన వారితో కలిసిపోయి సందడిగా వుందామె.

ఆ సమయంలో ఏదో పనుండి వంట శాలలోకి వెళ్ళిన సుబ్బలక్ష్మి అక్కడ ప్రధాన వంట వుట్టి (వంటవాడు) కేకలు వింది.

'ఎందుకండీ మమ్మల్నిలా తీసేస్తారు. మాకు వంటరాదా? మీరే వచ్చి చెప్పాలా? చూడండి! చెయ్యి తెగివాడు, వాడికి తోడుగా వీడూ హాస్పటల్‌కి పోవాలి. ఇద్దరు మనుషులు ఇలాంటి టైంలోపోతే మేమేం కావాలిశ్రీ ఇన్ని వంటలు చేశాంగాని మీలాసలహాల పేరుతో నస పెట్టే వారిని చూడలేదు. గంట నుంచీ మా బుర్ర తినేశారు కదండీ' అంటూ ఛడామడా వాయించేస్తున్నాడు మధ్యలో బూతులు కూడా చేర్చి.

అక్కడున్నది తన భర్త కైలాసం ఒక్కడే. అవన్నీ అతడికే అని అర్థం. చేస్కున్న సుబ్బలక్ష్మి అక్కడ్నుంచి జారుకుంది. అది అక్కడతో కాకుండా పందిరంతా అల్లుకుంది. భర్త చేసిన పని వల్ల తలకొట్టేసినట్టయి సిగ్గుతో తప్పించుకు తిరుగుతోందామె. కానీ బంధువుల్లో ఒకావిడ పిలిచి

'సుబ్బులూ! ఈ నల్లపూసలు కాస్త ఎక్కించు తల్లీ. నాగవల్లికి టైమ అయిపోతూంది' అంటూ ఆమెతో పాటు మరి ముగ్గురిని వారితోబాటు ఇద్దరు కన్నె పిల్లల్ని కూర్చోబెట్టింది. అందులో కూర్చున్న ఆడవాళ్ళలో ఒకావిడ డి.ఇ.ఓ గారి భార్య, మరొకామె ఇంజనీరు భార్య. వాళ్ళ కూతురూ. ఇలా మంచి హోదాలో వున్న వాళ్ళే వున్నారు. వాళ్ళ మధ్య కూర్చోడానికి మొహమాటంగా వున్నా, వారి చనువు వల్ల వారితో కలిసిపోయింది. సరదాగా నవ్వుతూ నవ్విస్తూన్న వారితో ఆనందంగా పనిలో మునిగి పోయింది.

ఇంతలో వెనక నుంచీ 'ఏమే రత్తాలూ! మాగున్నావా' ఎంత ఇంజనీరు పెళ్ళాంవైతే మాత్రం పలకరిస్తే నీ సొమ్మేం పోతుందేంటి' అంటూ అక్కడికొచ్చాడు కైలాసం. ఆ పలకరింపు, అతడి మాట తీరూ అక్కడి వారికి వెగటు కలిగించాయి. పెద్ద వాళ్ళేమనకపోయినా వాళ్ళ పదహారేళ్ళ కూతురు తల్లికి జరిగిన అవమానం సహించలేక

'మా అమ్మ పేరు రత్తాలు కాదు. రత్నమాల' అంది. అది విన్న కైలాసం

'తెలుసే ఇవాళ ఇంజనీరు పెళ్ళాం అయింది కాబట్టి రత్నమాల' అని పిలుస్తున్నారు గాని మా చిన్న తనంలో మేమంతా 'రత్తాలు' అనే పిలిచే వాళ్ళం. అయినా మీ అమ్మననే సరికి ఎంత పౌరుషం వచ్చిందే గుంటా' అన్నాడు. అంతటితో ఊరుకోకుండా ఆ పిల్ల చేతిలోంచి నల్లపూసల దండ లాక్కుని 'ఎమిటీ గుంజడం అంటూ చూపుడు వేలు బొటన వేలుతో నాకి ఆ దారాన్ని నలిపి ఎక్కించడం మొదలెట్టాడు.

అది చూసిన ఒకామె అతడి ముఖం మీదే 'ఆడారి అచ్చిగాడు' వచ్చాడు మనమెందుకే రండి' అనడంతో అంతా లేచి పోయారు. సుబ్బలక్ష్మి కూడా అతడు తన భర్త అని ఎక్కడ బయట పడుతుందోనని భయంతో వాళ్ళతో కలిసి వెళ్ళి పోయింది. అతడు తన భర్తని వాళ్ళకి తెలియదనే

## జహాద్

అర్ధాంతరంగా జీవితాన్ని ముగిస్తూ
వెళ్ళిన మిత్రుడెప్పుడూ
కల్లోలం రేపుతూ ఉంటాడు.

స్వప్నాలతో ఆకాశానికెగిరిన వాడు
నేల మీద
ఆయుధాలతో వుస్తాడు

నా కళ్ళతో కవిత్వం పలికించి
గోరింకలతో డేగల్ని చంపిస్తాను
అమ్ముల పొదిలో దాచిన అక్షరాస్త్రాల్ని వొదిలి
నీలి ఆకాశంపై
ఎర్రని వస్త్రాన్ని కప్పతాను

హక్కుల్ని నిర్భయంగా నలిపేస్తున్నప్పుడు
మిత్రమా! విచారణలొద్దు
వాడికి, మనకి బహిరంగ యుద్ధమే

—సదానందం పెట్టుబడి


మురిగోళ్ళ మువ్వల శబ్దం
వింటారా?

కొన్ని రోజులు ఆగండి!

విషయం ఇందాక వారి సంభాషణ వల్ల తెలిసినామె సంతోషించింది. అతడు తన భర్త అనే విషయం తెలిసిన వారైతే తన ఎదురుగా వంటసాలలో జరిగిన సంఘటనని వ్యంగ్యంగా చెప్పకోరనిపించింది. అయినా భర్త ప్రవర్తన ఈ సంఘటనతో అసహ్యం కలిగించిందామెకి. అప్పడనుకుంది భర్తకి ఏదైనా ఒక వ్యసనం అంటగట్టాలని.

* * *

'వడ్డీ ఎంతైనా ఫర్వాలేదు తీసుకోండి. వెయ్యి రూపాయలిప్పించండి' ఎంతో దానంగా అడుగుతున్న అతడి మాటలు విన్న సుబ్బలక్ష్మికి జాలి కలుగుతోంది గాని. కైలాసం మాత్రం కరగలేదు.

'నా దగ్గరెక్కడున్నాయండీ! మొన్న పాడిన చిట్ ఫండ్ డబ్బులు ఫిక్సెడ్ డిపాజిట్ చేసేశాను' అంటూ ఎంత బతిమాలినా, లేదని చెప్పి పంపేశాడు.

'భర్తని ఎలా మార్చాలా?' అన్న ఆమెకి ఒక పరిష్కారం లభించినట్టయింది. ప్రయోగం చెయ్యాలనుకుంది.

మనిషి మంచి వాడైనా ఇతర వ్యాపకాలేవీ లేకే ఇలా తయారయ్యాడని ఆమెకీ తెలుసు. మొదట్లో ఏదో ఒక వ్యసనం వుంటే బయటికి పోతాడనిపించినా, వ్యసనాలున్న భర్తల వల్ల బాధలు పడుతున్న చుట్టు పక్కల ఆడవాళ్ళని చూసి, 'క్షణిక సుఖం కోసం చెడు అలవాట్లు చేస్తే అవి వ్యసనంగా మారితే నష్టపోయేది తనే అనిపించింది. అందుకే భర్తకి వ్యసనం బదులు వ్యాపకం కల్పించాలనుకుని పథకం రూపొందించింది.

* * *

'ఏమండీ!' గోముగా పిలిచింది సుబ్బలక్ష్మి. ఏదో పాటలో చెప్పినట్లు 'పతి దేవు ఒడిలోన ఒరిగేటి వేళ' అది. ఎలాటి మగాడైనా లొంగేదాక్షణంలోనే కదా? అందుకే తన్మయంగా పలికాడు కైలాసం.

'ఒక్క విషయం చెబుతాను ఏమనరు కదా?' అంది ఉపోద్ఘాతంగా. 'దేవి గారు ఆజ్ఞ ఏమిటో శలవియ్యండి' పైట సవరిస్తూ అన్నాడు.

'మీరు మొన్న చిట్‌ఫండ్ పాడారు కదా? పాతిక వేలుది ఏడు వేలు నష్టంకి' అంది.

'ఔను. ఏం! దాని మీద నీ కన్నుగాని పడిందేమిటి? అలాటి ఆశలేం పెట్టుకోకు. ఆ పద్దెనిమిది వేలూ ఎఫ్.డి చేసేశాను' అన్నాడు కైలాసం.

అది బేంక్‌లో వుంటే ఏం వడ్డీ వస్తుంది చెప్పండి. అంతకంటే బయట వడ్డీలకిస్తే డబ్బు పెరుగుతుంది కదండీ' అంది.

'ఎందుకు లెద్దూ లేనిపోని తంటా. వాళ్ళ చుట్టూ ఎవడు తిరుగుతాడు? అన్నాడు.

'మీ రెందుకూ తిరగడం? ఒక్కసారి అలవాటు పడితే వాళ్ళే మీ చుట్టూ తిరుగుతారు. అయినా ఎవరికి పడితే వాళ్ళకివ్వరు కదా మీరు. కాస్త మంచి వాళ్ళకే ఇస్తారు' అంది.

'అలాంటి వాళ్ళెలా తెలుస్తారు? కాస్త మెత్తబడుతూ అన్నాడు.

'ఎందుకు తెలీదూ? మీ స్కూల్ మాస్టరు ఉదయం వచ్చారా? అతనికిచ్చారనుకోండి. మీ స్కూల్ స్టాఫే కాబట్టి ఎక్కడికి పోరు. అలాగే మీకు తెలిసిన వారు చాలా మంది వుంటారు. అదీ కాక బయట అందరూ అయిదులు వసూలు చేస్తున్నారు. మీరు మూడుకిచ్చారనుకోండి. పద్దెనిమిది వేలకి నెలకి ఇంచుమించు అయిదు వందలొస్తుంది' అంటే సంవత్సరానికి ఆరు వేలు వరకూ వస్తుంది. అదీకాక మీరు తొందరపడి ముందే పాడేశారాయె. ఇంకా మూడు సంవత్సరాలు కట్టాలి. అదే డబ్బు ఈ మూడు సంవత్సరాలకు రెట్టింపై పోతుంది' అంది లెక్కలు వివరిస్తూ. అంతే ఆలోచించిన కైలాసం.

'ఏమో అనుకున్నాను గాని నువ్వు నాకు తగిన దానివే' అన్నాడు. ఆ మాటకి పైకి నవ్వేసి నామె అతడి కౌగిట్లో ఒరిగిపోయింది. మనసులో మాత్రం.

'మీరు మగాడికి తగినట్టుగా వుంటే నాకు అంత కంటే కావాల్సిందేముంది' అనుకుంది.

* * *

సుబ్బులూ నేనలా పనుండి వెళుతున్నాను. పావు గంటలో వస్తాను. ఈలోగా చిట్‌ఫండ్ ఏజెంట్ వస్తే కూర్చోమను' న్నాడు కైలాసం


'ఏమిటి విశేషం. చిట్‌ఫండ్ ఏజెంట్ ఎందుకు?' అంది సుబ్బలక్ష్మి.

'నువ్వు చూపిన మార్గమే. వడ్డీల వల్ల బేంక్ లోన్ తేలిపోయింది. ఎఫ్.డి లోన్ తీసుకున్న సొమ్ము మాత్రం టర్నోవర్‌లో వుంది. ఇకపై వచ్చే వడ్డీలతో మరో చిట్‌ఫండ్ గ్రూపులో చేరబోతున్నాను' అన్నాడు.

'ఉండండి కాఫీ కలుపుతున్నారు. తాగి వెళ్ళండి' అంది. అది విన్న కైలాసం తొందరపడుతూ.

'కాఫీ తరువాత. ఇప్పడెళ్ళకపోతే అవతల వాడు వెళ్ళిపోతే ఈనెల వడ్డీ రాదు. అట్నుంచి వచ్చి తాగుతాలే' అంటూ గబగబా వెళ్ళిపోతున్న భర్తని చూసి సంతోషించింది.


డబ్బు సంపాదనలో పడిన భర్త ఎప్పడింటికొస్తాడా? అనే ఎదురు చూపులే తప్ప. ఎంత వేగిరం బయటికి పోతాడా అనే విసుగు లేదామెకిప్పడు. ఒక మనిషికి మార్గదర్శి నయ్యాననే తృప్తి కూడా వుందామెకిప్పడు.





## అమితాబ్ కాలేజీ

ఉత్తరప్రదేశ్‌లోని సఫాల్ అనే వూళ్లో అమితాబచ్చన్ పేరిట ఓ గవర్నమెంట్ కాలేజీని ములాయంసింగ్ యాదవ్ ప్రారంభించారు. నా అభిమాన నటుడికి నేను ఇంతకన్నా నీరాజనం ఏమివ్వగలవాడను అంటూ ములాయం ఇకిలించారు. ఇది ఆయన దీర్ఘకాలిక కోరిక కూడానట!



## నీలం మంచితనం

కొస్త మంచి మప్పితం, సంస్కారం సౌజన్యం వున్న హీరోయిన్ల కోవలో 'నీలమ్'ది ప్రథమ స్థానం. ఈ మధ్య ఆమెకు సుస్తీ చేసి హాస్పటల్‌లో జేరింది. పరిశ్రమలో చిన్నా పెద్దా బేధం లేకుండా అంతా వచ్చి ఆమెను పరామర్శించారు. మంచితనానికి విలువ ఎప్పడూ వుంటుంది. నీలమ్! విష్యూ స్పీడీ రికవరీ!!